కథ

పెన్మెత్స శ్రీకాంత్‌రాజు

# ఆ మాట

ఒక చిన్నపిల్లవాడు అన్నమాట అరవై ఐదేళ్ళ నుండి నేను ప్రవర్తిస్తున్న తీరును పునఃపరిశీలన చేసుకునేలా చేస్తుందని, ఆత్మ విమర్శకై ప్రేరేపిస్తుందని, ఆ మాటకే నా వ్యక్తిత్వం ఇంతలా రూపాంతరం చెందుతుందని, రామ పాదం తాకి రాయి మనిషి రూపం దాల్చినట్టు ఆ మాట ప్రభావానికే నేను మారిపోయానంటే నాకిప్పటికీ ఆశ్చర్యమే!

ఓ గుమస్తాగా జీవితం ప్రారంభించిన వ్యక్తి అనతికాలంలోనే ఓ కర్మాగారానికి అధిపతి కాగలిగేడంటే అది సామాన్యమైన విషయం కాదనేది అందరూ ఒప్పుకునే సత్యం!

ఈ ప్రపంచంలో నాయకత్వ లక్షణాలతో పుట్టేవాళ్ళు చాలా కొద్దిమందే ఉంటారు. మిగతా వాళ్ళందరూ అనుచరులుగా మాత్రమే పనికొస్తారు. అలాంటి నాయకత్వ లక్షణాలు నాలో చాలామెండు! అందువల్ల నా మాటే శాసనం నా ఇంట్లో అయినా, నా ఫ్యాక్టరీలో అయినా!

నాకు ముగ్గురు కొడుకులు. ఇద్దరు కూతుళ్ళు. నా ముగ్గురు కొడుకులు, కొడళ్ళూ, ఇద్దరు కూతుళ్ళూ, అల్లుళ్ళూ. నాతోనే నా ఇంట్లో నివసిస్తున్నారు. నా అల్లుళ్ళిద్దరూ, నా కొడుకులు ముగ్గురూ నా ఫ్యాక్టరీలో వేరువేరు విభాగాలకు అధిపతులుగా ఉన్నారు. ఛైర్మన్ హోదాలో నేనున్నాను.

పది రూపాయలు పెట్టి కొనాల్సిన మేకులైనా, పది లక్షలు పెట్టి కొనాల్సిన యంత్రమైనా, నా కొడుకులు కాని, అల్లుళ్ళు కాని నన్ను సంప్రదించకుండా నిర్ణయం తీసుకోరు. వాళ్ళు నిర్ణయం తీసుకోవడమేంటి? నేను తీసుకున్న నిర్ణయాన్ని అమలు పరుస్తారు. అంతే...

ఇంట్లో ఎవరైనా సిన్మాకి వెళ్ళాలన్నా, షికారుకి వెళ్ళాలన్నా నా పర్మిషన్ తప్పనిసరి! అంతెందుకు నా మనవలెవరూ హాల్లోకి వచ్చి టీవీ చూడరు. స్నేహితుల ఇళ్ళకు వెళ్ళరు. సాయంత్రం పూట ఆడుకోటానికి కూడా వెళ్ళరు ఎప్పుడన్నా కనికరించి నేను అనుమతి ఇస్తే తప్ప!

నా వాళ్ళెవరూ నేను చెప్పినదానికి ఎదురు చెప్పరు. వెంటనే నేను చెప్పింది చేయటం మొదలు పెట్టేస్తారు. నా వాళ్ళందరికి తెలుసు నేను వాళ్ళకోసం ఎంత కష్టించి ఈ ఐశ్వర్యవంతమైన స్వర్గాన్ని సృష్టించానో, ఎంత తెలివిగా వచ్చిన ప్రతి అవకాశాన్ని వడిసిపట్టి బండిని ఓడగా మార్చేనో!

అయినా, నా మాట నా వాళ్ళందరూ వినడం ఓ గొప్పగా నేను భావించను. ఈ వయసులో కూడా నేను నా కొడుకులు, అల్లుళ్ళకంటే చురుగ్గా పనిచేయగలను. తెలివిగా నిర్ణయాలు తీసుకోగలను. అందుకే నా మాటంటే అందరికి గురి! గౌరవం.

ఆ ఊరి మధ్యలో రెండువేల చదరపు గజాల స్థలంలో రాజమహల్‌ని తలపింపచేసేలా ఉంటుంది నా ఇల్లు. పది పడక గదులు, నాలుగు హాళ్ళు, వంట గది, పెద్ద పూజగది, ఇంటి చుట్టూ నందన వనాన్ని తలపింపచేసే రీతిలో కనువిందు చేసే నీటికొలను, తివాచీ గడ్డి, పూలచెట్లు, తీగలు, లతలు... నా ఇల్లు అందమైన సౌధం.

నా ఐదుగురు పిల్లల కుటుంబాలు ఒకే వంటగది కలిగిన నా ఇంట్లో ఏ పొరపొచ్చాలు లేకుండా ఉంటున్నారు. అందుక్కారణం నేనే!

వరి తవుడులోంచి నూనె తీసే ఈ పరిశ్రమను, ఇరవై ఏళ్ళ క్రితం నేను స్థాపించబోతుంటే నవ్వని వాళ్ళు లేరు. వేరుశనగ లేదా నువ్వుల నూనెలను వాడతారు కాని ఈ తవుడు నూనె ఎవరు కొంటారు? అని ముఖం మీదే ఎద్దేవా చేసారు. కాని నాకు ఆర్థిక విపణి, దాని తీరుతెన్నుల మీదున్న అవగాహన, నువ్వులనూనె వేరుశనగ నూనెల స్థానంలో క్రొత్త రకాల నూనెలు పోటీ పడతాయన్న నా విశ్లేషణ నన్ను ముందడుగు వేయటానికి ప్రోత్సహించాయి.

రోజుకి ఇరవై గంటలు పని చేసాను. నా రక్తాన్ని చెమటగా మార్చి నా సంస్థను అభివృద్ధి చేసాను. నేను చేస్తున్నది సరైనదే అని నాకు అన్పించినపుడు ఎదుటి వాళ్ళ భావాలను పట్టించుకోనవసరం లేదన్నది నా అనుభవం నాకు నేర్పిన పాఠం. అందుకే నేనెవరి భావాలకు విలువివ్వను.

అరవై ఐదేళ్ళ ఈ వయసులో అందర్ని చెప్పుచేతల్లో ఉంచుకుని కనుసన్నల్లో మెలిగేలా చేసుకోవటం ఒక్క నాకు మాత్రమే సాధ్యమనుకుంటా, అందుకే నన్ను చూసుకుని నాకే గర్వంగా అన్పిస్తుంది.

వ్యాపార సమాచారం గురించి పేపరులో చదువుతుంటే ఫోను మ్రోగింది. నెంబరు చూసాను. మా చిన్నల్లుడు అర్జున్.

"మావయ్యా.. నేను అర్జున్‌ని"

"చెప్పు" అన్నాను.

"మీతో కొంచెం మాట్లాడాలి"

"ఇప్పుడు కాదు అరగంట తర్వాత రా" అన్నాను.

"సరే మావయ్యా" ఫోను పెట్టేసాడు.

మళ్ళీ చదవటంలో మునిగిపోయాను.

అరగంట తర్వాత అర్జున్ వచ్చాడు.

చేత్తోనే అతన్ని కూర్చోమని సైగచేసి, చదవటం పూర్తి చేసి అర్జున్ వైపుతిరిగేను. "ఏదో మాట్లాడాలన్నావు?"

"అవును మావయ్య మా చిన్నాన్న కూతురు బి.కాం. చదివింది. కంప్యూటర్ కోర్సులు కూడా చేసింది. మన దగ్గర గుమస్తా ఉద్యోగం ఒకటి ఖాళీగా ఉంది కదా! వాళ్ళిప్పుడు చాలా ఇబ్బందుల్లో ఉన్నారు. ఆ ఉద్యోగం తనకిస్తే.."

"అనుభవం ఉందా?"

"లేదు"

నా ముందున్న బల్ల క్రిందభాగాన ఉన్న సొరుగులో నుంచి దరఖాస్తుల కట్టతీసి వాటిని క్లుప్తంగా పరిశీలించి మా అల్లుడి బంధువు పేరడిగి ఆ దరఖాస్తు నిశితంగా పరికించి "చూడు అర్జున్ మనకు వచ్చిన దరఖాస్తులన్నింటిలోకి ఈ అమ్మాయికే తక్కువ అర్హతలున్నాయి, మిగతా అందరూ అనుభవం, మంచి అర్హతలున్న వాళ్ళే" అన్నాను.

"మిగతా అందరూ ఏదో ఉద్యోగం చేస్తున్నారు. ఈ అమ్మాయి ప్రస్తుతం ఖాళీగా ఉంది. తెలివైయింది. పని త్వరగానే నేర్చుకుంటుంది"

"మనం ఈ పరిశ్రమ నడుపుతున్నది నిరుద్యోగులకి ఉద్యోగులివ్వటంకోసం కాదు. ఈ సంగతి తర్వాత చూద్దాంలే" అన్నాను. కాని నా మాటల్ని బట్టి అర్జున్‌కి అర్థమై ఉంటుంది నాకు ఇష్టంలేదని.

"సరే" గొణిగేడు లేస్తూ.

నవ్వుకున్నాను నేను.

సాయంత్రం నేను ఇంటికి వెళుతున్నప్పుడు బంట్రోతు రమణయ్య వచ్చి నాకు నమస్కారం పెట్టి చేతులు నలుపుకోసాగాడు. అతనేదో చెప్పాలనుకుంటున్నాడని అర్థమై గడియారం వంక చూసి అతనివేపోసారి చిరాగ్గా చూసి అడిగాను. "ఏమిటి?" అని.

"బాబూ నా జీతం పెంచదయ్యా. ఇంటిదానికి మధుమేహం, రక్తపోటు. మందులకు చాలా కరుసవుతోందయ్యా, జీతం సరిపోవట్లేదు"

"ఏడాదేడాది జీతం పెంచుతూనే ఉన్నాంగా?"

"పది సంవత్సరాల క్రితం ఐదొందలకు చేరనయ్యా. సంవత్సరానికో వంద చొప్పున పెరిగి ఇప్పుడు పదిహేను వందలయిందయ్యా. కనికరించి ఒక్క మూడొందలు పెంచదయ్యా"

"ఒకేసారి మూడొందలా? ఆలోచిస్తాలే" అన్నాను కారెక్కుతూ. అతని ముఖంలో నిరాశ నా దృష్టి దాటిపోలేదు.

○○○

నేను భోజనం చేస్తుండగా మా పెద్దకోడలు వచ్చి కాస్త దూరంగా తలవంచుకుని నిలబడింది. నేను గమనించనట్టే తినడం మీద దృష్టి పెట్టాను.

"మావయ్యా"

తింటున్న వాడిని తలెత్తి చూసానామెవైపు 'ఏమిటన్నట్టు'

"మా నాన్నకి జ్వరమట. ఓసారి మా ఊరు వెళ్ళి వస్తాను" అడిగింది.

"పది రోజుల క్రితమేగా వచ్చావు?"

"అవును, కాని మా అమ్మలేదు కదా" ఆమె గొంతు వణికింది.

"మీ అన్నయ్య ఉన్నాడుగా, మీ వదిన ఉంది చూసుకోవటానికి. ఇక్కడ నువ్వు లేకపోతే అబ్బాయికి, పిల్లలకి ఇబ్బంది. వచ్చే నెలలో పిల్లలకు సెలవులిస్తారుగా అప్పుడు వెళ్దువులే! జ్వరానికి కంగారు పడతావెందుకూ?"

"ఈ మధ్యనే కదా మావయ్యా అమ్మ పోయింది. నాన్న బెంగపడ్డారేమోనని"

"అలాంటి గాయాల్ని కాలమే మాన్పుతుంది" ముక్తసరిగా అని లేచి చెయ్యి కడుక్కున్నాను.

నా అభిప్రాయం అర్థమై వెనుదిరిగిందామె. వాళ్ళమ్మ పోయినప్పుడు వెళ్ళి ఇంచుమించు పదిహేను రోజులుండి వచ్చింది. వచ్చి పదిరోజులు కాలేదు, మళ్ళీ వెళతానంటోంది. ఈ ఆడవాళ్ళకు చనువిస్తే రోజూ పుట్టింట్లోనే ఉంటామంటారు. ఎవర్ని ఎక్కడ త్రొక్కి ఉంచాలో నాకు బాగా తెల్సు.

○○○

నా మనవలు చదువుకునేందుకు ప్రత్యేకంగా ఓ గదిని కేటాయించాను. సాయంత్రం స్కూలు నుండి వచ్చేక వాళ్ళను చదివించటానికి ఓ ఉపాధ్యాయుడ్ని కూడా నియమించాను.

నేను కూడా నాకు ఖాళీ దొరికినప్పుడల్లా వారి చదువుని పర్యవేక్షిస్తుంటాను. వాళ్ళ బడికి ఫోను చేసి వాళ్ళ అభివృద్ధిని వాకబు చేస్తుంటాను. నా మనవలు నా కంటి దీపాలు. నా పంచ ప్రాణాలు! కాని అదెప్పుడూ వాళ్ళముందు వ్యక్తపరచను. నా మనవలెవరూ నా మీసాలు పట్టి లాగలేదు. నా భుజాలెక్కి ఆడనూలేదు. 'ఆఁ!' అనగానే ఆగేలా వాళ్ళని అదుపులో ఉంచుకుంటున్నాను.

"తాతయ్యా మా స్కూలులో పిల్లల్ని విహారయాత్రకు ఊటీ తీసుకెళుతున్నారు రెండు వేలు కట్టాలి. నేను వెళ్ళనా?" అన్నాడు నా పెద్ద మనవడు. వాడి పేరు నా పేరే.

"వద్దు" వాడి ముఖం వెలవెలబోయింది. నా నోటి నుండి వచ్చిన సమాధానానికి ఇంకేమీ మాట్లాడలేదు. "తాతయ్యా పంపవూ?" అంటూ అందరి పిల్లల్లా బ్రతిమాడలేదు. అంత చనువు నేనెవ్వరికి ఇవ్వను.


ఇంతలో ఏడేళ్ళ నా ఆఖరి మనవడు కార్తిక్ ముందుకొచ్చి "తాత పోనీ కాసేపు తోటలో ఆడుకోమా?" అన్నాడు. వాడు అచ్చం నాలానే ఉంటాడు. వాడడిగిన తీరుకి వాడిని ఎత్తుకుని ముద్దుపెట్టుకోవాలన్పించింది. కాని అలా చేస్తే వాడింక నా నెత్తి ఎక్కుతాడు. మిగతా పిల్లలూ వాడినే అనుసరిస్తారు. మనసులోని భావాల్ని అణిచేసుకుని "వద్దు, నోర్మూసుకుని పుస్తకాలు తీసి బాగా చదవండి" అంటూ అక్కడ్నుంచి వచ్చేసాను.

సగటు చిన్న పిల్లలు చేసే అల్లరి నా మనవలు మచ్చుకైనా చేయరు. ఏదైనా కార్యక్రమానికో పెళ్ళికో వాళ్ళందర్ని తీసుకెళ్ళినా అదే క్రమశిక్షణతో ఉంటారు వాళ్ళు.

'నీ క్రమశిక్షణే వేరు' అంటూ బంధువులు, మిత్రులు పొగడుతుంటే నా ఛాతీ చుట్టు కొలత పెరుగుతూ ఉంటుంది.

○○○





"ఏమండీ నిద్రపోతున్నారా?" నా భార్య అనసూయ చాలా తక్కువ స్వరంతో అడిగింది.

"లేదు"

"రాములవారి గుడి పూజారి వచ్చారు"

"ఊ"

"లక్ష రూపాయలు విరాళమిస్తే మన పేరు మీద నెలకొకరోజు లక్షరూపాయల మీద వచ్చే వడ్డీతో అన్నదానం చేస్తారట"

"ఊ"

"మనము ఇస్తే బావుంటుందని"

"ఇద్దామనుకుంటే ఓ వేయి నూట పదహార్లివ్వు! అంతే కాని లక్షల్లో విరాళాలివ్వడానికి ఇక్కడ చెట్లకేం కాయట్లేదు డబ్బు"

మా ఆవిడ నుండి సమాధానం లేదు. ఉండదని నాకు తెల్సు. లక్ష రూపాయలు నేను ఎడమ చేత్తో ఇవ్వగలను. కాని ఈ దానాలు, ధర్మాలు నా వంటికి అస్సలు పడవు.

ooo

ఉదయం పదకొండు గంటలైయింది.

నా కార్యాలయంలో ఫోను మ్రోగింది. అది నా మనవలు చదివే పాఠశాల నుండి...

"హలో"

"సార్ నమస్కారం. నేను మీ మనవడు కార్తీక్ టీచరును. మీతో ఓ విషయం చెప్పాలి"

"ఏమైంది?"

"కంగారుపడవలసిన విషయం కాదు. కాకపోతే మీకు తెలియజేయాలన్పించి ఫోను చేసాను" చెప్పిందావిడ.

"సరే చెప్పండి. వాడు సరిగ్గా చదవటం లేదా! మార్కులు తక్కువ వచ్చాయా?"

"అది చదువుకి సంబంధించి కాదు. మీరు ఏమీ అనుకోకపోతే ఒకసారి ఇక్కడికి రాగలుగుతారా? రెండు మూడు రోజులు పోయాక వచ్చినా పర్వాలేదు"

కాని ఈ ఉద్విగ్నతను పొడిగించలేదు.

"ఇప్పుడే ఓ పావుగంటలో మీ ముందుంటాను" ఫోను పెట్టేసి కుర్చీలోంచి లేచి నిలబడ్డాను.

ooo

టీచరు చెప్పిన విషయం విని చండప్రచండ గ్రీష్మ పవనాల తాకిడికి అల్లల్లాడిన చివురుటాకు చందాన విలవిల్లాడాను. చెవుల్లో ఏదో హోరు! నిజమేనా? ఏడేళ్ళ చిన్నవాడు అలా అన్నాడా?

"మీరు సరిగ్గా విన్నారా?"

"లేదండి.. నేనే స్వయంగా విన్నాను. అలా మాట్లాడకూడదని వాడికి నచ్చచెప్పేను. పిల్లల్లో ఇలాంటి అనారోగ్యకర మైన ఆలోచనలు మంచివి కావు. మీకు తెలియపరిస్తే మంచిదని చెప్పేను. మరోలా అనుకోకండి"

"పర్వాలేదు. మీరీ సంగతి నాకు చెప్పినట్టు ఇంకెవరికీ చెప్పకండి. కార్తీక్‌కి కూడా"

"సరే" అంది ఆ టీచర్.

అడుగెయ్యటానికి కూడా ఓపికలేదు! ఒంట్లో శక్తంతా ఎవరో తోడేసినట్లన్పిస్తోంది. ఎలా కారు వరకూ నడిచేనో నాకే తెలియదు. కారులో కూర్చుని "ఇంటికి పోనీయ్" అన్నాను.

ఇంటికెళ్ళాక నా గదిలోకెళ్ళి తలుపులు వేసుకుని మంచం మీద వాలిపోయాను. ఏడేళ్ళ పిల్లవాడు అంత మాట ఎలా అనగలిగాడు? ఆ చిన్నారి హృదయంలో అంత ద్వేషం, అయిష్టత ఎలా పేరుకుపోయాయి. పసిపిల్లాడు కాబట్టి బయటకు అన్నాడు. అందరూ నా గురించి అలానే అనుకుంటున్నారా? నా వాళ్ళందరికి మానసికంగా నేను దూరమైపోతున్నానా?

పూరిగుడిసెలో గడిచిన నా బాల్యం గుర్తొచ్చింది. అర్ధాకలి, చిరిగిన బట్టలు, పుస్తకాలు కొనడానికి ఎంతో ఇబ్బంది పడిన రోజులు గుర్తొచ్చాయి.

పేదవాడిగా నేను పొందిన చేదు అనుభవాలు, నా పిల్లలు, నా మనవలు నా వాళ్ళెవరూ పొందకూడదని వాళ్ళకో బంగారు ప్రపంచం నిర్మించి ఇవ్వాలని జీవితమంతా నేను పడ్డ శ్రమ గుర్తొచ్చింది.

సంపన్నుడిని ఐనప్పటికీ ఇప్పటికీ అంతే శ్రమ ఒత్తిడి అనుక్షణం నేను అనుభవిస్తూనే ఉన్నాను. ఇదంతా ఎవరికోసం? నా ఒక్కడి జానెడు పొట్ట కోసమే అయితే ఇంత సంపద ఎందుకు?

ఏ రోజైనా హాయిగా ఒక సినిమా చూసానా? ఆహ్లాదాన్నిచ్చే ఓ ప్రదేశానికెళ్ళానా? నా పరుగు పందెంలాంటి జీవితంలో మనసుకు అర క్షణమైన ఊరటనిచ్చేనా? ఇంత కష్టపడి నా అనుకున్న వాళ్ళకి ఇంత చేసిన నేను ప్రతిగా వాళ్ళు నా మాట వినాలనుకోవడంలో తప్పేం ఉంది? ఉన్నట్టుండి నాకు అన్పించింది. ఇక్కడే ఎక్కడో నా అభిప్రాయంలో చిన్న లోటు ఉందేమోనని! ఏమిటది?

మాట వినాలనుకోవటానికి కూడా కొన్ని పరిమితులుంటాయా? నేను పరిధులు దాటి అందరి స్వేచ్ఛను హరించేస్తున్నానా? నేను అహోరాత్రాలు కష్టించి సృష్టించిన ఈ స్వర్గాన్ని బంగారు పంజరంగా భావిస్తున్నారా నా వాళ్ళంతా? ఇన్నాళ్ళు అందరూ నేను గీచిన గీటు దాటకపోతే అదంతా నా మాట మీద గురి. నా మీద గౌరవం అనుకున్నాను. కానీ నాణేనికి ఆవలివైపు గురించి ఆలోచించలేదు.

నేను అమితంగా ప్రేమించే నా

## అన్నీ లాగించేస్తా

*'సొంతం', 'జెమిని' సినిమాల్లో నమితకి ఇప్పటి నమితకి ఎంతో తేడా వుంది! నాజూగ్గా స్లిమ్‌గా వుండే నమిత ఇప్పుడు బొద్దుగా కొండొకచో మరీ లావుగా కూడా తయారైంది. అయితే హీరోయిన్లు ఇలా వుంటే కెరీర్‌కి నష్టం కదా అనుకుంటే పొరపాటే. నమిత బొద్దుగా వుండడమే ఆమెకి గిట్టుబాటవుతోంది. 'నా అభిమానులు ఇలాగే చూడాలనుకుంటున్నారు కనుక నేనిలాగే వుండదల్చుకున్నాను. ఆమధ్య వరకూ చికెన్ మానేసాను, సన్నబడదామని. కానీ మళ్లీ తినడం మొదలు పెట్టేసాను. ఇష్టమైనవన్నీ ఎంచక్కా లాగించేస్తాను. మరీ పాత్రకి కావాలంటే సన్నబడ్డానికి కూడా రెడీయే' అంటోంది నమిత.*



కుటుంబ సభ్యుల అయిష్టతని, వ్యతిరేకతను అస్సలు తట్టుకోలేను. నా వాళ్ళ కోసం జీవితం ధారపోసిన నేను వాళ్ళకోసం నా ప్రవర్తనని మార్చుకోవాలి. తప్పదు!

ooo

మా అల్లుడి నెంబరు నొక్కి ఫోను చెవి దగ్గరుంచుకున్నాను.

"మావయ్యా" అర్జున్ గొంతు.

"మీ చిన్నాన్న కూతురికి ఉద్యోగం కావాలన్నావు కదా" అడిగేను.

"అవును మావయ్యా"

"ఆ ఉద్యోగానికి ఎవరినైనా తీసుకున్నామా?"

"లేదు"

"అయితే ఆ అమ్మాయిని రేపు వచ్చి ఉద్యోగంలో చేరమని చెప్పు"

"మావయ్యా" ఆశ్చర్యానందాలు అర్జున్ గొంతులో.

అతని ముఖాన్ని, అందులోని సంతోషాన్ని, ఆ గొంతులోని ఉద్వేగాన్ని బట్టి ఊహించుకోగలిగేను.

"ఈ రోజు రాత్రి భోజనాల సమయంలో మన కుటుంబ సభ్యులందరూ కలవాలి. అందరికీ చెప్పు" అన్నాను ఫోను పెట్టేస్తూ!

సాయంత్రం కారులో ఇంటికెళుతుంటే నమస్కారం పెడుతూ రమణయ్య కనిపించాడు. అతని ముఖం దీపపు శిఖలా వెలిగిపోతోంది. అతని జీతం వెయ్యి రూపాయలు పెరిగింది మరి!

ooo

"మీ ఐదుగురూ మన కర్మాగారానికి మేనేజింగ్ డైరెక్టర్లు. మీ విభాగాల గురించి మీకు పూర్తి అవగాహన ఈపాటికే వచ్చి ఉంటుంది. ఇక మీదట ప్రతి చిన్న విషయానికి నన్ను సంప్రదించవలసిన అవసరం లేదు. మీ ఐదుగురు సామరస్యంతో, ఒకరికొకరు విలువ ఇచ్చుకుంటూ కర్మాగారాన్ని మరింత అభివృద్ధి చేయటానికి ప్రయత్నించండి. ఇక ఏ విషయంలోనూ నా జోక్యం ఉండదు. మీకు నా సలహా అవసరమైనప్పుడు మాత్రమే నన్ను సంప్రదించండి. నా ఆస్తి నా ఐదుగురు పిల్లలకు సమాన వాటాలుగా విభజించి వీలునామా కూడా వ్రాసేను" నా మాట పూర్తవ్వగానే నా కుటుంబ సభ్యుల నోళ్ళు కొంచెం తెరుచుకున్నాయి. ఆశ్చర్యంలో వాళ్ళందరి ముఖాల్లో తళుక్కుమన్న చిన్న మెరుపు నా దృష్టి దాటిపోలేదు.

"ఇప్పుడీ ఆకస్మిక నిర్ణయమేమిటి?" ఆశ్చర్యంగా అడిగేడు మా పెద్దబ్బాయి.

"నా మనసు విశ్రాంతి కోరుతోంది. ఇదో రకం పాక్షిక వాన ప్రస్థాశ్రమం లాంటిది" నవ్వుతూ చెప్పేను.

అత్తలేని కోడలు ఉత్తమురాలంటారు. కాని నా పెద్ద కోడలు అత్త ఉన్నప్పటికీ ఉత్తమురాలే! అలాంటి మా ఇంటి మహాలక్ష్మిని, భార్యను కోల్పోయిన తన తండ్రిని చూసొస్తానంటే వద్దన్నాను.

"ఒరేయ్ మీ ఆవిడ్ని రేపే తీసుకెళ్ళి వాళ్ళ నాన్న దగ్గర విడిచిరా. పాపం ఆయన భార్యను పోగొట్టుకుని ఆ దిగులుతో జ్వరపడ్డారు. మన ఇంటికి వచ్చి ఉండమను. స్థలమార్పు మనసుని కుదుటపరుస్తుంది..ఏమంటావు లతా?" నా గొంతు, నా మాట తీరు నాకే ఆశ్చర్యంగా ఉంది. ఇంత మార్దవంగా మాట్లాడగలనని నాకే తెలియదిన్నాళ్ళు.

సంభ్రమాశ్చర్యాలతో నా వైపు చూసింది లత, మా పెద్ద కోడలు.

"మావయ్యా" ఆమె గొంతు ఆనందంతో కంపించింది.

ఆమె మొదటి పెళ్ళి రోజున రవ్వల గాజులు కొని ఇచ్చినప్పుడు కూడా ఈ స్థాయి ఆనందాన్ని ఆమె ముఖంలో చూడలేదు నేను.


మనసు గది ఆనందంతో నిండిపోవటమంటే ఏమిటో నాకు అనుభవంలోకొచ్చింది. ఎదుటివారి అభిప్రాయాలను స్వేచ్ఛను గౌరవించడంలో కూడా ఇంత ఆనందం ఉంటుందని ఇప్పుడే తెలిసొస్తోంది.

ooo

"అప్పుడే నిద్రా?" నుదుటి మీదున్న ముంగురులను సర్దుతూ అన్నాను.

## ప్చ్! జెనీలియా!!

జెనీలియా-హిందీ యువ హీరో రితేష్ దేశ్‌ముఖ్‌ల ప్రేమాయణం కొంత కాలంగా వినిపిస్తున్న సంగతి అందరికీ తెలుసు. మహారాష్ట్ర ప్రస్తుత ముఖ్యమంత్రి విలాస్‌రావు దేశ్‌ముఖ్ సుపుత్రుడైన రితేష్-జెనీలియా ఒకేసారి తెరకి పరిచయం అయ్యారు. ఆ పరిచయం ప్రేమగా మారి పెళ్ళి చేసుకోవాలనుకునేంత దాకా వచ్చింది. అయితే గోవా క్రిస్టియన్ అమ్మాయి అయిన జెనీలియాని తమ కోడలిగా ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించమని రితేష్ తల్లిదండ్రులు తెగేసి చెప్పేయడంతో రితేష్ కూడా అందుకు రాజీపడిపోయాట్ట. పాపం జెనీలియా ఇక కెరీర్ మీదే దృష్టి పెట్టబోతోందని బాలీవుడ్ జనాల ఉవాచ.



"ఆఁ! లేదు" కంగారుగా అంది అనసూయ.

"ఎందుకంత కంగారు?" భుజాల చుట్టూ చేయివేస్తూ అన్నాను. ఆశ్చర్యంగా చూసింది నా వైపు.

"మొన్న లక్ష రూపాయల విరాళమిద్దాం అన్నావు కదా! ఇదిగో నీ బ్యాంకు ఖాతా పుస్తకంలో పది లక్షలు వేసాను ఈ రోజు. నువ్వు ఎలా కావాలంటే అలా ఖర్చు పెట్టుకో. నువ్వు గుళ్ళకి గోపురాలకి వెళ్ళేటప్పుడు నన్ను కూడా పిలువు. సంపాదనే ధ్యేయంగా పెట్టుకుని మానసికంగా నీకు దూరమైపోయాను. ఇక నీ తోడిదే మిగిలిన జీవితం" నా భార్య ఒడిలో తలపెట్టుకుని ఎప్పుడూ పొందని అనిర్వచనీయమైన హాయిని పొందసాగాను.

ooo

బడి నుండి రాగానే స్నానాలు చేసి కాంప్లాన్ త్రాగి పుస్తకాలు ముందేసుకుని కూర్చున్నారు నా మనవలు. నన్ను చూడగానే దిక్కులు చూస్తున్న వాళ్ళు చటుక్కున్న తలవంచేసుకుని చదివేసుకోసాగారు.

"అందరూ బాగా చదువుతున్నారా?" గంభీరంగా అడిగాను.

బొమ్మల్లా తలూపారు అందరూ.

"నువ్వు విహార యాత్రకు ఊటీ వెళతానన్నావు కదా, మీ టీచరుకు రేపు డబ్బు పంపిస్తాను. జాగ్రత్తగా వెళ్ళిరావాలి సుమా!" నా పెద్ద మనవడికి చెప్పేను.

వాడి ముఖం మతాబులా వెలిగిపోయింది.

"అలాగే మా బంగారు పిల్లలకు ఈ రోజునుండి ఐదింటి నుండి ఆరింటి వరకూ ఆటలు. మీరు తోటలో ఆడుకోవచ్చు" అందరూ సంతోషంతో ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

"కాని ఒక షరతు. ఎవరికైతే వచ్చే పరీక్షలలో మార్కులు తగ్గుతాయో వాళ్ళను ఆ తర్వాత నుండి ఆటకు పంపను. కాబట్టి ఆటలు తర్వాత అంతే బాగా చదవాలి" అన్నాను.

"సరే" ఒప్పుకున్నారు పిల్లలందరూ.

"తాతయ్యా" చెయ్యి చూపాడు నా చిన్నారి మనవడు కార్తీక్ కృతజ్ఞతా పూర్వక కరచాలనానికి.


పెద్ద ఆరిందాలా ప్రవర్తిస్తున్న వాడిని అలా చూడగానే ఆనకట్ట పగలకొట్టుకున్న గోదారిగంగలా నా మనస్సులో వాత్సల్యం పెల్లుబికింది. వాడిని రెండు చేతుల్తో నా గుండెకు హత్తుకుని గిరగిరా తిప్పేసి ముద్దులు పెట్టేసుకున్నాను. అసలు కంటే వడ్డీ ముద్దని ఎవరన్నారో కాని అక్షరసత్యమది.

నా ప్రవర్తనలోని క్రొత్తదనానికి తెల్లబోయిన మిగతా మనవలు ఒక్క క్షణం తర్వాత ఆ గౌరవం తమకూ కావాలనట్టు నన్ను చుట్టేసారు. ఎవర్నీ వదలకుండా అందరికీ ముద్దులిచ్చి పుచ్చుకుని స్వాతి చినుకుల్లో తడిసిన ముత్యపు చిప్పలా మురిసేను!

ooo

అప్పటికి మూడు రోజుల నుండి నాకు జ్వరం.

ఇంటిల్లిపాది నన్ను కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం వైద్యుడు వచ్చి నన్ను పరీక్షించి వెళుతున్నాడు.



బడినుంచి వచ్చేక నా మనవలు చేస్తున్న హడావుడికి అంతే ఉండటం లేదు. కాళ్ళు నొక్కుతామని, మందేస్తామని, అమృతాంజనం రాస్తామని, వాళ్ళు చేస్తున్న హంగామా అంతా ఇంతా కాదు. ఇదివరకైతే దూరంగా ఉండటమే తప్ప దగ్గరకొచ్చే సాహసం చేసేవారు కాదు.

ఆ రోజు సాయంత్రం బడి నుండి ఏడుస్తూ వచ్చాడు కార్తీక్. రాగానే నన్ను చుట్టేసాడు. "ఏరా, ఏమైంది" లాలనగా అడిగేను.

"నా వల్లే నీకు జ్వరమొచ్చింది తాతయ్యా. ఆ వేళ వర్షంలో ఆడుకుందాం రమ్మని నిన్ను నీళ్ళలో తడిపేసాను. అందుకే ఇలా అయింది నీకు"

"చిన్న జర్వమే కదా రేపటికి తగ్గిపోతుంది" వాడి తల నిమురుతూ అన్నాను.

"నాకు భయం వేస్తుంది తాతయ్య. మా తరగతిలో నితిన్ అనే అబ్బాయి వాళ్ళ తాతయ్య ఇలానే జ్వరం వచ్చి చచ్చిపోయారట. నువ్వూ అలా చచ్చిపోతావేమోనని భయం వేస్తుంది. నువ్వంటే నాకిష్టం తాతయ్యా. నీ జ్వరం తగ్గిపోమ్మను నువ్వు నన్ను వదిలేసి దేవుడి దగ్గర కెళ్ళిపోకు తాతయ్యా" వెక్కి వెక్కి ఏడవసాగాడు.

నా పెదవుల మీదకు చిరునవ్వు వచ్చింది.

అప్రయత్నంగా నెల రోజుల క్రితం టీచరుతో వాడన్న మాటలు గుర్తొచ్చాయి.

ఆరోజు...

ooo

"రండి కూర్చోండి" టీచర్ నన్ను వినమ్రంగా ఆహ్వానించింది.

"ఏమైయిందసలు?"

"సాధారణంగా పిల్లలు తాతయ్యా, నాన్నమ్మ, అమ్మమ్మ లాంటి వాళ్ళతో ఎక్కువ అనుబంధాన్ని కలిగి ఉంటారు. మీరు కూడా మీ మనవల విషయంలో చాలా శ్రద్ధ తీసుకుంటున్నారు. కార్తీక్ ఎందుకలా అన్నాడో అర్థం కావటంలేదు"

"ఏమన్నాడు?" కొంచెం ముందుకు వంగేను.

ఆమె ఓ క్షణం తటపటాయించి చెప్పింది. "మా తాతయ్య అంటే అస్సలు ఇష్టం లేదు. ఎప్పుడూ కోపంగా అది చెయ్యొద్దు, ఇది చెయ్యొద్దు అంటారు. ఆయన చచ్చిపోతే నాకెంత బాగుంటుందో అంటున్నాడు"

ooo

నెల రోజుల క్రితం అదే పసి గొంతు నుండి వెలువడిన నాపై అక్కసుతో కూడిన మాటలు.. నేడు అవ్యాజమైన ప్రేమను కురిపించేలా రూపాంతరం చెందేయంటే అంతకంటే ప్రామాణికం ఏముంది నేను మారేనన దానికి!

O

## ఎవరు వింటారు?

ఒక్క సినిమా సక్సెస్ అయితే చాలు లక్షల్లక్షలు పారితోషికం అమాంతం పెంచేస్తుంటారు తారలు. అవును మరి దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలిగా! ఇటీవల 'బతుకమ్మ' సినిమా విజయం సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఈ విషయమై ఆ సినిమా హీరోయిన్ సింధు తులానీకి ఆర్.నారాయణ మూర్తి ఓ సలహా ఇచ్చార్ట- పారితోషికం అమాంతం పెంచేయవద్దని. తారలు ఇష్టం వచ్చినట్టు రెమ్యూనరేషన్ పెంచేయడం ఆయనకి అంతగా నచ్చదు. కానీ ఆయన మంచి ఆలోచన ఎవరికి నచ్చుతుంది చెప్పండి.